క్లుప్తంగా

'వాహన చోదకులు హెల్మెట్ ధరించాలి'



ర్యాలీలో మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి రత్నకుమార్

చోడవరం: రోడ్డు ప్రమాదాల నుంచి రక్షించుకోవడానికి వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చోడవరం 9వ అదనపు జిల్లా జడ్జి కె.రత్నకుమార్ సూచించారు. హెల్మెంట్ ధరించడంపై ప్రజలను చైతన్య పరిచేందుకు చోడవరంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఉషోదయ కాలేజీ విద్యార్థులు, ప్రజాసంఘాలు సంయుక్తంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోర్టు ఆవరణ నుంచి మెయిన్‌రోడ్డుపై ర్యాలీ చేశారు. ప్రజల్ని మరింత చైతన్య పరిచేందుకు పోలీసు అధికారులు, న్యాయవ్యాదులతో న్యాయమూర్తి సమీక్ష జరిపారు. కార్యక్రమంలో చోడవరం సీనియర్ సివిల్ జడ్జి రాజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్త మల్లంపేటలో వైద్య శిబిరం



రోగులకు వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారి శ్యామ్

గొలుగొండ: కొత్తమల్లంపేట గ్రామంలో గొలుగొండ వైద్యాధికారి శ్యామ్ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా రోగులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం దోమల వ్యాప్తి వలన ఎక్కువగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, ఇంటి వద్ద, పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూసుకోవాలన్నారు. కాచి, వడబోసిన నీటిని తాగాలన్నారు. వైద్య శిబిరంలో రోగుల్ని పరీక్షించి, మందులు అందించారు. గ్రామాల్లో దోమల నివారణకు స్ప్రేయింగ్, ఫాగింగ్ చేస్తున్నట్లు వెల్లడించారు.

90 మందికి కంటి వైద్య పరీక్షలు

మాకవరపాలెం: ఉచిత కంటి వైద్య శిబిరంలో 90 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మండల కేంద్రంలోని మహిళామార్ట్ వద్ద బుధవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో వివిధ గ్రామాలకు చెందిన 90 మంది హాజరయ్యారు. వీరికి పరీక్షలు నిర్వహించగా 65 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరిని విశాఖ తరలించారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు, నిర్వాహకులు లక్ష్మీప్రసన్న, మనోహర్‌నాయుడు, క్యాంప్ కోఆర్డినేటర్ అశ్విన్‌కుమార్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

దేవరాపల్లి: సీజనల్ వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.అప్పలరాజు సూచించారు. మండలంలోని గరిశింగి పంచాయతీ పరిధిలో శివారు గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. పారిశుద్ధ్య తీరును పరిశీలించారు. అక్కడే జరుగుతున్న ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలించి, అందిస్తున్న సేవలపై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం కాశీపురంలో సర్పంచ్ ఎ.వరక్ష్మి అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో పాల్గొన్నారు. గ్రామంలోని డ్రైనేజీ, మంచినీటి పథకాలను పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట జి.సంతోషి నళిని, పి.యశోద, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నియంత్రణకు చర్యలు



పోతనవలసలో వైద్య సిబ్బందితో ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారి శైలజ

కె.కోటపాడు: సీజనల్ రోగాలు ప్రబలే సీజన్‌లో పరిసరాల్లో నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకుంటే దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శైలజ అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా బుధవారం వైద్య సిబ్బందితో కలిసి పోతనవలసలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల నియంత్రణ ద్వారా డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధుల బారి నుంచి తప్పించుకోవచ్చన్నారు. ప్రతి శుక్రవారం ఇంట్లో పాత్రలన్నీ ఖాళీ చేసి డ్రైడేగా పాటించాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు, పీహెచ్‌ఎస్ ప్రమీల, హెల్త్ అసిస్టెంట్ ఆర్.గంగాధర్, పి.త్రినాథ్ పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7997958337, 7075709854, 7997958336

అక్కడ వృథా.. ఇక్కడ వ్యధ

- పెద్దేరులో వృథాగా పోతున్న వరద నీరు
- బుచ్చెయ్యపేట మండలంలో కానరాని వానజాడ
- ఆకుమడులను రక్షించుకునేందుకు రైతుల వెతలు

బుచ్చెయ్యపేట మండల పరిధిలో రైతులు విచిత్ర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఖరీఫ్ సాగు మొదలైనా.. ఆశించిన స్థాయిలో వర్షాల్లేక ఆకుమడులు ఎండిపోతున్నాయి. మరో వైపు ఏజెన్సీలోకురుస్తున్న వర్షాలకు మండలంలోని పెద్దేరు నుంచి నీరు వృథాగా కిందికి పోతోంది. పెద్దేరు నీరు తమ పంట పొలాలకు చేరేలా శాశ్వత చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



లోపూడిలో మెషీన్‌తో నీటిని తోడి ఆకుమడి తడుపుతున్న రైతులు

బుచ్చెయ్యపేట: మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఖరీఫ్ ఆరంభంలోనే వర్షాలు ముఖం చాటేస్తున్నాయి. సాధారణంగా బుచ్చెయ్యపేట మండలంలో జూలై మొదటి వారం నుంచి వరి ఆకుపోతలు, పచ్చని వరి ఆకుమడులతో గ్రామాల్లో పంట పొలాలు కళకళలాడాలి. రెండు వారాలు గడుస్తున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవని పరిస్థితి. దీంతో రైతుల్లో గుబులు రేగుతోంది.

పదో వంతైనా కురవలేదు!

జూలై నెలలో మండలంలో సాధారణ వర్షపాతం 156 మిల్లీ మీటర్లు. ఇందులో తొలి రెండు వారాల్లో కురిసే వర్షపాతమే ఎక్కువ. అయితే ఇప్పటి వరకు మండలంలో కేవలం 12 మి.మీ. వర్షపాతం మాత్రమే నమోదయింది. పది రోజులుగా గంటికొర్లాం, భట్లోవ, నిమ్మలోవ, పీడీ పాలెం, బుదిరెడ్లపాలెం, శింగవరం, లోపూడి, బంగారుమెట్ట, ఎల్‌బీ పురం తదితర గ్రామాల్లో ఆకుపోతలేశారు. అయితే వర్షాలు కురవక, అడపాదడపా కురిసినా అదను సరిపడక విత్తనాలు సరిగా మెలకెత్తలేదు. అరకొర అదనుతో భూమిలో కలిపిన విత్తనాలు చీమలకు, పక్షులకు ఆహారంగా మారుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొందరు రైతులు డీజిల్ పంపులతో సమీపంలోని గెడ్డలు, చెరువుల నుంచి నీటిని తోడి, ఆకు మడులకు తడులు పెడుతున్నారు. మండలంలోని రాజాం, నీలకంఠాపురం, తైపురం, భీమవరం, శివరాంపురం, మల్లాం తదితర గ్రామాల్లో వర్షాలు లేక పలువురు రైతులు ఇప్పటికీ వరి ఆకు పోతలు వేయలేదు.



వడ్డాది పెద్దేరు నది నుంచి వృథాగా పోతున్న నీరు

పెద్దేరు నుంచి వృథాగా నీరు

బుచ్చెయ్యపేట మండలంలో వర్షాలు కురవక రైతులు ఆందోళన పడుతుంటే, ఏజెన్సీ గ్రామాల్లో కురుస్తున్న వర్షాలకు వడ్డాదిలో పెద్దేరు మాత్రం వర్షం నీటితో నిండుగా ప్రవహిస్తోంది. భారీగా వరద నీరు చేరి పెద్దేరు నుంచి దిగువకు వృథాగా పోతోంది. ఒకే మండల పరిధిలో వర్షం నీటి కోసం రైతులు ఆశగా ఎదురు చూస్తుంటే.. అదే మండలంలో ప్రవహిస్తున్న పెద్దేరు నీరు వృథాగా పోతుండటంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దేరు నీటిని మండల గ్రామాలకు మళ్లించేలా శాశ్వత ఏర్పాట్లు చేసినట్లయితే ఈ పరిస్థితి ఉండేది కాదని వాపోతున్నారు.

ఆకు పూర్తిగా నాటలేదు



ఖరీఫ్ సమయం రావడంతో పది రోజుల క్రితం వరి ఆకు పోశాను. రెండెకరాల్లో వరి సాగుకు శ్రీకాకుళం సన్నాలు జల్లాం. ఆకుపోత నుంచి వర్షాలు కురవట్లేదు. ఎండ వేడికి ఆకుమడిలో పదును లేక సరిగా ఆకు మొలకెత్తలేదు. డీజిల్ పంప్‌తో ఆకు మడికి నీటి తడి అందిస్తున్నా. దీంతో అదనపు పెట్టుబడి అయింది. ఖరీఫ్ ఆరంభంలోనే నీటి కష్టాలు ఎదుర్కొంటున్నాం.

– కలవలపల్లి మాలునాయుడు, రైతు, శింగవరం

నెలాఖరు వరకు అనుకూలం



వరి ఆకు పోతకు జూలై నెలాఖరు వరకు సమయం ఉంది. ఇప్పటికే ఆకు పోత లేసిన రైతులు భూమిలో పదును లేకపోతే నీటితో ఆకు మడులను తడిపి పదును అందించాలి. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఆకు మడి పూర్తిగా నిండిపోయేలా తడపొద్దు. ఎకరా ఆకు మడికి కేజీ వరకు పొటాషియం జల్లుకుని నీటి తడులు అందిస్తే ఆకు ఎండిపోకుండా ఉంటుంది.

– భాస్కరరావు, మండల వ్యవసాయాధికారి, బుచ్చెయ్యపేట.

రోడ్డును ఆక్రమించిన టీడీపీ నాయకుడు

బుచ్చెయ్యపేట: మండలంలోని కరక గ్రామంలో సిమెంట్ రోడ్డును గ్రామ టీడీపీ నాయకుడు ఆక్రమించి ప్రజలకు నడకదారి లేకుండా చేశాడు. గ్రామంలో ఉన్న చెరువు గట్టు నుంచి గ్రామానికి వచ్చే ప్రధాన రోడ్డుకు అడ్డంగా కర్రలు పెట్టి, రోడ్డు మధ్యన సిమ్మెంట్ దిమ్మ కట్టాడు. దీంతో యన్నెంశెట్టి వారి వీధి, తెప్పల, దమ్ముల వారి వీధుల్లోకి వెళ్లే ప్రజలకు రహదారి సౌకర్యం లేక వేరే రోడ్డులో రాకపోకలు సాగిస్తున్నారు. ఏడేళ్ల క్రితం నిర్మించిన సిమెంట్ రోడ్డును ఆక్రమించిన టీడీపీ నాయకుడిపై తక్షణం అధికారులు చర్యలు తీసుకుని, రహదారి సౌకర్యాన్ని పునరుద్ధరించాల్సిందిగా గ్రామస్తులు కోరుతున్నారు.



కరకలో సిమెంట్ రోడ్డుకు అడ్డంగా కర్రలు కట్టిన దృశ్యం

వరాహావతారంలో జగన్నాథుడు

చోడవరం: స్థానిక ప్రాచీన దేవాలయమైన బొడ్లవీధి రామాలయంలో కొలువైన జగన్నాథుడు వరాహావతారంలో బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథ స్వామి రథోత్సవం, దశావతార అలంకరణ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. 11రోజుల పాటు ఈ ఆలయంలో స్వామివారు దశావతారాల్లో భక్తులకు దర్శన మిస్తారు. నాలుగవ రోజున స్వామివారు వరాహావతారంలో భక్తులకు దర్శన మిచ్చారు. ఆలయ అర్చకులు సీతారామాచార్యులు, రామకృష్ణాచార్యులు స్వామివారికి ప్రత్యేక అలంకరణలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ అర్చకులు స్వామివారికి పత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని, హరి నామ సేవ చేశారు.



చోడవరంలో వరాహ రూపునిగా దర్శనమిచ్చిన బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామి

వర్షాకాలంలో పశు పోషణలో జాగ్రత్తలు

కె.కోటపాడు: వర్షాకాలంలో పాడి రైతులు పశుపోషణలో జాగ్రత్తలు పాటించాలని పశువైద్యాధికారి సీహెచ్‌వై నాయుడు సూచించారు. కొరువాడలో బుధవారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. 19 పశువులకు గర్భకోశ చికిత్స, 23 పశువులకు సాధారణ వైద్యం, 19 పెయ్యిలకు నట్టల నివారణ మందు అందించారు. వర్షాల సమయంలో పశువులను బురద, నీటి నిల్వ ప్రాంతాలకు దూరంగా ఉంచాలన్నారు. రైతుల ఆవుజాతి పశువులకు ప్రస్తుతం లంపీస్కిన్ వ్యాక్సిన్‌ను వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆరు మాసాల వయస్సు దాటిన ఆవుకు వ్యాక్సిన్‌ను వేయించడం ద్వారా వ్యాధి బారిన పడకుండా చూసుకోవచ్చని రైతులకు సూచించారు. కార్యక్రమంలో గోపాల మిత్ర వేచలపు గోవింద పాల్గొన్నారు.



పశువులకు గర్భకోశ చికిత్స అందిస్తున్న పశువైద్యాధికారి నాయుడు

స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



బుచ్చెయ్యపేటలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శనలో అంగన్‌వాడీలు

- మండల కేంద్రాల్లో గళమెత్తిన అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు



చోడవరంలో మెయిన్‌రోడ్డుపై భారీ ర్యాలీ చేస్తున్న అంగన్వాడీ, ఆశా, ఎండీఎం నిర్వాహకులు



రోలుగుంట తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



నాతవరం ప్రధాన కూడలిలో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు



చోడవరం కొత్తూరు జంక్షన్‌లో మానవహారం చేస్తున్న కార్మికులు



మాకవరపాలెం: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు



గొలుగొండ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐకి వినతిపత్రం అందిస్తున్న వర్కర్లు



రావికమతం మండలంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు



దేవరాపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు

బుచ్చెయ్యపేట: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం అందించాలంటూ మండలంలోని అంగన్‌వాడీ సిబ్బంది బుధవారం నిరసనకు దిగారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైటాయించి ఐసీడీఎస్‌ను బలోపేతం చేసి బడ్జెట్‌ను పెంచాలని, సుప్రీం కోర్టు తీర్పు మేరకు గ్రాట్యుటీ, కనీస వేతనం నెలకు రూ.26 వేలు అమలు, అంగన్‌వాడీ ప్రీ స్కూల్ బలోపేతం, ఐదేళ్లలోపు పిల్లలు ప్రైవేట్ కాన్వెంట్లకు వెళ్లకుండా సర్క్యులర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ సిబ్బందిపై రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని, ఇటీవల గెలిచిన ప్రభుత్వ నాయకులు కొన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ సిబ్బందిపై ఒత్తిడి తెచ్చి, రాజీనామాలు చేయాలంటూ బెదిరిస్తున్నారని ఆక్షేపించారు. ఈ మేరకు తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది వరలక్ష్మి, సీఐటీయూ నాయకులు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

చోడవరం: కార్మికుల, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు ఆందోళనకు దిగారు. చోడవరం మెయిన్‌రోడ్డుపై భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొత్తూరు జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ఆటో ముఠా, బిల్డింగ్, ఇతర అసంఘటిత కార్మికులకు సమగ్రమైన చట్టాన్ని అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, వీవోఏలు వంటి స్కీమ్ వర్కర్లకు వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అక్రమ తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. అనంతరం చోడవరం తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందించారు. ఈ ఆందోళనలో సీఐటీయూ నాయకుడు ఎస్వీ నాయుడు, ఆయా కార్మిక సంఘాల ప్రతినిధులు కె.వరలక్ష్మి, బొద్దాన రామలక్ష్మి, సూర్యకాంతం, కొండమ్మ, గూనూరు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రావికమతంలో..

రావికమతం మండలంలో కార్మికులు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా భారీ నిరసన ప్రదర్శన చేశారు. మెయిన్‌రోడ్డుపై ప్రదర్శనగా వచ్చి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఉద్యోగ, కార్మిక, స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో కార్మిక సంఘ నాయకులు సత్యవేణి, గోవిందరావు, పార్వతి, గెంజి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

రోలుగుంట: కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్లకార్డులతో అంగన్‌వాడీ వర్కర్లు నిరసన తెలిపారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, విశాఖ స్టీల్‌ప్లాంటును పరిరక్షణ తదితర డిమాండ్లను ప్లకార్డులపై రాసి ప్రదర్శించారు. వీరి న్యాయసమ్మతమైన కోర్కెలను పరిష్కరించాలంటూ సీఐటీయూ నాయకులు మద్దతిచ్చారు. ఈ ఆందోళనలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కృష్ణవేణి, వర, నూకరత్నం, లక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాల అమలుకు ఆందోళన

మాకవరపాలెం: కనీస వేతనాలు అమలు చేయాలంటూ అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు ఆందోళన చేశారు. ఈ మేరకు బుధవారం కోర్కెల దినం పేరిట సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగులకు హాని చేసే లెటర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, వెలుగు వీవోఏలు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, సమగ్రశిక్ష, హెల్త్ మిషన్, ఆయుష్, ఉపాధి హామీ, సేంద్రియ వ్యవసాయ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనాలు అందించాలని నినాదాలు చేశారు. దీర్ఘకాలంగా పరిష్కారం కాని కార్మికులు, ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో ఐద్వా జిల్లా నాయకురాలు సూర్యప్రభ, ఐసీడీఎస్ ప్రాజెక్టు లీడర్ ధనలక్ష్మి, మండలంలోని వివిధ గ్రామాల అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కీం కార్మికుల డిమాండ్స్ డే

దేవరాపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో ఉద్యోగులకు, కార్మికులకు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే అమలు చేయాలని స్కీమ్ వర్కర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిమాండ్స్ డేను పురస్కరించుకుని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, ఐకేపీ, వీఆర్ఏ తదితర స్కీమ్ వర్కర్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. అనంతరం స్థానిక తహసీల్దార్ జి.లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘ నేతలు డి.వెంకన్న, బీటీ దొర మాట్లాడుతూ కార్మికుల సమస్యలు దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. బడ్జెట్‌లో నిధుల కోతతో అన్ని రంగాల్లో కార్మికులకు, సామాన్య ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. కార్మికులకు కనీస వేతనం, పెన్షన్, సామాజిక భద్రత సౌకర్యాలు కల్పించాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులైన ముఠా, ఆటో బిల్డింగ్, తోపుడు బళ్లు, మోటార్ తదితర కార్మికులకు పని భద్రతపై ప్రభుత్వం సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, కంటింజెంట్, పార్టు టైమ్, గెస్ట్ తదితర కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్టర్ తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను అమలు చేసి, నూతన పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి జి.వరలక్ష్మి, పద్మ, గౌరి, అరుణశ్రీ, అప్పారావు, లీల, రమణమ్మ, చిన్నమ్ములు, బొజ్జులు, పైడిరాజు, పాపమ్మ, దేముడమ్మ, ఈశ్వరమ్మ తదితర కార్మికులు, స్కీమ్ వర్కర్లు పాల్గొన్నారు.

నాతవరం: ప్రభుత్వం కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కారించాలని సీఐటీయూ జిల్లా నాయకురాలు కె.ప్రసన్న డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. మెయిన్‌రోడ్డుపై ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్‌వాడీ, ఆశ వర్కర్లపై ఇటీవల పెరుగుతున్న రాజకీయ నాయకుల వేధింపుల్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయుకులు వరలక్ష్మి, చిన్నతల్లి, లక్ష్మి పాల్గొన్నారు.

గొలుగొండ: కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడి, ఆశ, మిడ్ డే మీల్స్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు. కార్మికుల కోర్కెల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో పనిచేస్తున్న కార్మికులంతా ఆందోళనలో పాల్గొన్నారు. కార్మికుల హక్కులకు భంగం కలగకుండా ప్రభుత్వాలు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నేత సాపిరెడ్డి నారాయణమూర్తి సంఘీభావం తెలిపారు.

మాడుగుల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు తక్షణమే నెరవేర్చాలని, సీఐటీయూ మండల కార్యదర్శి ఇరట నరసింహమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక గాంధీపార్కు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ, ఆశ, వెలుగు వీవోఏలు, వీఆర్ఏ, ఎండీఎం తదితర అన్ని పథకాల కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలన్నారు. పాత పింఛన్ విధానం పునరుద్దరణ తదితర డిమాండ్లతో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మయ్యకు వినతి పత్రం అందించారు. ఆర్.వరలక్ష్మి, వీవోఏల యూనియన్ నాయకులు బత్తుల గంగా భవానీ, ఈశ్వరరావు పాల్గొన్నారు.

కె.వల్లాపురంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు

మాడుగుల రూరల్: మండలంలోని కింతలి పీహెచ్‌సీ పరిధి కె.వల్లాపురంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు అందించారు. కింతలి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.నాగదివ్య 65 మందికి వైద్య సేవలు అందించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రతలు తీసుకోవాలని రోగులకు సూచించారు. ప్రధానంగా కాచి, చల్లార్చిన నీటిని తాగాలన్నారు. దోమల వ్యాప్తిని అరికడితే మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి రోగాలు దరిచేరవన్నారు. శిబిరంలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ కార్యకర్తలతో పాటు 104 సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధ్యాయ శిక్షణ తరగతులు



శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో జయలక్ష్మి

చోడవరం: బోధనలో మరింత ఉత్తమంగా రాణించేందుకు చోడవరం ఎమ్మార్సీ భవనంలో గత 9 రోజులుగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణతరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి జయలక్ష్మి మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా ఎప్పటికప్పుడు బోధనలో జరుగుతున్న మార్పులపై శిక్షణ పొందడం ఎంతైనా అవసరమన్నారు. చోడవరం క్లస్టర్‌లో 9 రోజులుగా జరుగుతున్న శిక్షణతరగతుల్లో అనేక విషయాలపై శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థిలో అంతర్గత శక్తి దాగి ఉంటుందని, దాన్ని గుర్తించి, ఆ దిశగా విద్యార్థికి బోధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ ఐవీ రామిరెడ్డి, ఎంఈవో సింహాచలం, సీఆర్‌పీలు, ట్రైనీలు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు



తామరబ్బలో పారిశుధ్య పనుల్ని పర్యవేక్షిస్తున్న సర్పంచ్ టోకురి రామకృష్ణ

దేవరాపల్లి: తామరబ్బ పంచాయతీ పరిధిలో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ టోకురి రామకృష్ణ తెలిపారు. పంచాయతీ పరిధిలో బుధవారం చేపట్టిన పారిశుధ్య పనుల్ని ఆయన పర్యవేక్షించారు. గ్రామంలో చెత్తాచెదారాలతో పాటు డ్రైనేజీల్లో పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మంచినీటి ట్యాంక్‌లో క్లోరినేషన్‌తో పాటు వీధుల్లో బ్లీచింగ్ చేశామన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఎల్.లింగన్న, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రాజా, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పంట కాల్వ ఆక్రమణల తొలగింపు

చోడవరం: పంట కాల్వల ఆక్రమణలపై ఆయకట్టు రైతుల ఫిర్యాదుతో ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. కల్యాణపులోవ రిజర్వాయర్‌కు సంబంధించి ముంతమామిడి పంట కాల్వ గట్టు గత కొంతకాలంగా ఆక్రమణలో ఉంది. దీంతో ఆయకట్టు రైతులు రిజర్వాయర్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణ, వీఆర్వో లక్ష్మి సిబ్బందితో వచ్చి కాల్వ ఆక్రమణపై సర్వే చేశారు. అనంతరం ఆక్రమణలకు తొలగింపు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సత్యదేవ్ పాల్గొన్నారు.

కొండ ఆక్రమణల్ని అడ్డుకున్న అధికారులు

గొలుగొండ: మండల కేంద్రం గొలుగొండ సమీపంలో కొత్త జోగుంపేట వద్ద రెవెన్యూ కొండను అక్రమించి జేసీబీతో పనులు జరపడంపై స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు బుధవారం పనుల్ని అడ్డుకున్నారు. జోగుంపేట జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద రెవెన్యూ కొండ ఉంది. దీన్ని జోగుంపేటకు చెందిన వ్యక్తులు ఆక్రమించి పనులు చేపట్టడంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వీఆర్వో రాజుబాబు పనుల్ని అడ్డుకున్నారు. భూములకు సంబంధించిన ఆధారాలుంటే తహసీల్దారుకు సమర్పించాల్సిందిగా సూచించారు. ఆక్రమణలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఆక్రమణల్ని తొలగిస్తున్న వీఆర్వో రాజుబాబు